క్లుప్తంగా

పశువులకు వ్యాక్సినేషన్



వ్యాక్సినేషన్ కార్యక్రమంలో పాల్గొన్న సిబ్బంది

ఎటపాక: గొరిదేవిపేట పశువైద్యశాల ఆధ్వర్యంలో పంచాయతీ పరిధిలోని పశువులు, మేకలు, గొర్రెలకు శుక్రవారం వ్యాక్సిన్ వేశారు.ప్రతీ ఇంటికి వెళ్లి పశువులను జాగ్రత్తగా కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వెటర్నరీ డాక్టర్ మహేశ్వరరెడ్డి, సచివాలయ సహాయకులు తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నేత వెంకటరెడ్డికి నివాళి



వెంకటరెడ్డి స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

చింతూరు: మండల కేంద్రంలోని సీపీఎం నాయకుడు శ్యామల వెంకటరెడ్డి వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పార్టీ మండల కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన వెంకటరెడ్డి రైతు సంఘం నాయకుడిగా ప్రజా సమస్యల పరిష్కారంలో విశేష కృషి చేశారని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. శ్రీనివాసరావు, వెంకట్, సుబ్బమ్మ, లక్ష్మణ్, నాగమణి, సత్తిబాబు, దేశయ్య, జయలక్ష్మి పాల్గొన్నారు.

స్వయం ఉపాధిపై అవగాహన



సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు

రాజవొమ్మంగి: దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన, ఫిఫ్త్ జండర్ సంవద్ కార్యక్రమాల గురించి శుక్రవారం వెబనరీ జూమ్ మీటింగ్ జరిగింది. మండల వ్యాప్తంగా గల పొదుపు సంఘాల (ఎస్‌హెచ్‌జీ) మహిళలు పాల్గొన్నారు. నిపుణులు సూచించిన పలు అంశాలను ఆకళింపు చేసుకొనే ప్రయత్నం చేశారు. నైపుణ్యాభివృద్ధి ద్వారా మహిళలు స్వయంఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. ఈ పథకాన్ని కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ అమలు చేస్తోందని, స్థానిక వెలుగు కార్యాలయంలో పనిచేస్తున్న హెచ్‌డీసీసీ నిర్మల తెలిపారు.

విద్యుత్ షాక్‌తో పశువులు మృతి



మృతి చెందిన పశువులు

ఎటపాక : మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో తెగిపడిన విద్యుత్ వైరు తగిలి ఒక ఎద్దు, రెండు ఆవులు శుక్రవారం మృతి చెందాయి. కంగాల గంగయ్య రైతుకు చెందిన మూడు పశువులు గ్రామ సమీపంలోని జామాయిల్ తోటలో మేతకు వెళ్లాయి. అయితే ఆ సమయంలో కరెంట్ వైరు తెగి పశువులపై పడడంతో అవి అక్కడికక్కడే చనిపోయాయి. సమాచారం తెలుసుకున్న గొరిదేవిపేట పశువైద్యులు మహేశ్వరరెడ్డి పశువులకు పంచానామ నిర్వహించారు. మరణించిన పశువుల విలువ రూ.60వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు గంగయ్య కోరుతున్నాడు.

అప్రమత్తంగా ఉండాలి



సీఐ హిమగిరి

అరకులోయ రూరల్/దుంబ్రిగుడ: ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అరకులోయ సీఐ హిమగిరి చెప్పారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎడతెరిపివ్వని వర్షాలకు గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటే సాహసం చేయవద్దన్నారు. భారీ వర్షాల కారణంగా అరకు–విశాఖ ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉండడంతో సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు వాహనాల ప్రయాణాలను నిలుపుదల చేస్తున్నట్టు పేర్కొన్నారు. గెడ్డల వద్ద విగ్రహాల నిమజ్జనం సమయాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

తొలి పూజకు వేళాయె

- గిరిగ్రామాల్లో చవితి శోభ
- జోరుగా గణనాథుల విగ్రహాల అమ్మకాలు
- కిటకిటలాడిన మార్కెట్‌లు
- అందంగా అలంకరించిన మండపాలు



మట్టి గణపతి ప్రతిమను తయారుచేస్తున్న అరకు మాజీ ఎంపీ మాధవి



మట్టి వినాయక ప్రతిమలతో విద్యార్థులు

అరకులోయటౌన్/దుంబ్రిగుడ/ముంచంగిపుట్టు/పెదబయలు/కొయ్యూరు/సీలేరు/చింతపల్లి/ఎటపాక/రాజవొమ్మంగి: ఆది దేవుడు వినాయకునికి తొలి పూజకు భక్తులంతా సన్నద్ధమయ్యారు. గిరి గ్రామాల్లో వినాయక చవితి ఉత్సవాల సందడి మొదలైంది. వాడవాడలా మండపాలను సిద్ధం చేశారు. పట్టణంతో పాటు పల్లెల్లో ప్రతి వీధిలో పండగ వాతావరణం కనిపిస్తోంది. ఇప్పటికే వినాయక విగ్రహాలను తెచ్చుకొని శనివారం వినాయక చవితి పండగ నాడు విగ్రహాల ప్రతిష్ఠించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా మండపాలను ఏర్పాటు చేసి అందంగా అలంకరించారు.మండపాల వద్ద విద్యుత్‌దీపాలను, మైకులను కూడా ఏర్పాటు చేసుకున్నారు. మార్కెట్‌కు పండగ శోభ సంతరించుకుంది. వినాయక ప్రతిమలు, పూజా వస్తువులు, పండ్లు, పూలు, పత్రి, తదితర సామగ్రి దుకాణాలు కిటకిటలాడాయి. పలు గ్రామాల్లో గిరిజన యువత చూడ చక్కనైన రీతిలో,వివిధ ఆకారాల్లో గణనాథుని మండపాలు ఏర్పాటు చేస్తున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అల్లర్లు లేకుండా పోలీసులు నిర్వాహకులకు సూచనలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో చిన్న పిల్లలు ఉత్సవ నిర్వహణ కోసం వసూలు చేసిన చందాలతో మండపాలు ఏర్పాటుచేసుకున్నారు.సైజును బట్టి విగ్రహం ధర రూ.2వేల నుంచి రూ.20వేల వరకు విక్రయించారు. పండ్ల ధరలు పెరిగాయి.

అరకులోయ పట్టణంలో వాలీబాల్ క్రీడా మైదానంలో చవితి పండుగ నిర్వాహకులు చిన్నారుల కోసం జెయింట్ వీల్, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. వినాయక చవిత నవరాత్రులు పట్టణ వాసులతో పాటు మండలంలోని గిరిజన ప్రజలందరూ ఆనందంగా గడిపేలా గట్టి ఏర్పాట్లు చేస్తున్నారు. పెద బయలు మండలం సీతగుంటలో 12 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.



అరకులో ఏర్పాటుచేసి జెయింట్ వీల్, ఇతర ఆట వస్తువులు



ఎస్‌బీఐ రోడ్డులో సిద్ధమవుతున్న వినాయక మండపం



దళపతిగుడలో మట్టి ప్రతిమలను పంపిణీ చేస్తున్న డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం



ముంచంగిపుట్టులో పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న భక్తులు

కొయ్యూరులో మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మట్టితో చేసిన వినాయక ప్రతిమలను తయారు చేసి పలువురికి అందజేశారు. ఆమె మాట్లాడుతూ మట్టి విగ్రహాలను పూజించాలని కోరారు సీలేరు డీఏవీ పాఠశాలలో హెచ్‌ఎం కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వినాయక చవితి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మట్టితో తయారుచేసిన వినాయక ప్రతిమలను ప్రదర్శించారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

అరకులోయటౌన్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ బృందం ఆధ్వర్యంలో గిరి గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు వై.విజయలక్ష్మీ, పసుపులేటి నాగబాబు, మొష్యా అనితకుమారి మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ ఆదేశాల మేరకు మాడగడ పంచాయతీ బోసుబెడ, దళపతిగుడ, డింగ్రిపుట్, బోడుగుడ, బొంపి గ్రామాల్లో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసామన్నారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలను పూజించాలని గిరిజనులకు అవగాహన కల్పించామన్నారు. అధ్యాపకులు రాజు, బి.లచ్చన్న, వి.కామేశ్వేశ్వరరావు, ఎస్.అప్పారావు, సోంబాబు తదితరులు పాల్గొన్నారు.



రద్దీగా మారిన చింతపల్లి మార్కెట్



ఎటపాకలో కొనుగోలు చేసిన వినాయక విగ్రహాన్ని తరలిస్తున్న యువకులు



రాజవొమ్మంగిలో వినాయకుని విగ్రహాల అమ్మకాలు



పూజా సామాగ్రి కొనుగోలుకు తరలివచ్చిన భక్తులు



వినాయక ఉత్సవాలకు మండపం ఏర్పాటు చేస్తున్న కమిటీ సభ్యులు



సీతగుంటలో వినాయక మండపం ఏర్పాటు చేస్తున్న భక్తులు

బస్సు సర్వీసు సమయవేళల్లో మార్పు చేయాలి

ముంచంగిపుట్టు: పాడేరు నుంచి ముంచంగిపుట్టు మీదగా డుడుమ రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సు సమయ వేళల్లో మార్పు చేయాలని వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి కోరారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముంచంగిపుట్టులో ఉదయం 8.30గంటలకు, డుడుమలో సాయంత్రం 4గంటలకు ఉండేలా ఆర్టీసీ అధికారులు సమయం కేటాయించాలని, దీంతో అందరూ సకాలంలో వారి వారి గమ్యస్థానాలకు చేరేందుకు వీలుంటుందన్నారు. డిపో అధికారులు స్పందించి బస్సు సర్వీసు సమయవేళల్లో మార్పు చేయాలని కోరారు. సర్పంచ్ కె.మిల్కి, నేతలు దేవా, నీలకంఠం, పిత్‌బాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

చింతపల్లి: చింతపల్లి ప్రాంతీయ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డులు, స్టాఫ్ నర్సులు వేర్వేరుగా ఆందోళన చేపట్టారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని వేతనాలను సకాలంలో విడుదల చేయాలని, బకాయిలను చెల్లించాలని కోరుతూ విధుల విరామ సమయంలో ఆందోళన చేపట్టారు. దీనికి సంబంధించి అధికారులకు వినతి పత్రం అందజేశారు.

నష్ట పరిహారం చెల్లించాలని వినతి

అరకులోయ రూరల్: వర్షాల కారణంగా పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తక్షణమే పరిహారం చెల్లించాలని కోరుతూ గిరిజన సంఘం మండల కార్యదర్శి బుజ్జిబాబు తదితరులు రెవెన్యూ సిబ్బందికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఎటువంటి షరతులు లేకుండా రైతులందరికీ పరిహారం అందించాలన్నారు.రామారావు, బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



సమావేశంలో మాట్లాడుతున్న ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి

చింతపల్లి: విద్యార్థుల ఆరోగ్యంపై సంక్షేమాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చింతపల్లి మండల సహాయ సంక్షేమాధికారి జయనాగలక్ష్మి అన్నారు. ఆమె శుక్రవారం చింతపల్లిలో చింతపల్లి, గూడెంకొత్తవీధి మండలాల వసతి గృహ సంక్షేమాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులకు మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. నాణ్యమైన భోజనం ఇవ్వాలని, విద్యార్థులు ఎవరైనా అనారోగ్యమైతే తక్షణమే వైద్య సేవలందించాలని సూచించారు.

బాల్య వివాహాలతో అనర్థాలు



గాంధీనగర్ లో అంగన్‌వాడీ కేంద్రంలో పసిపిల్లల బరువులను పరిశీలిస్తున్న సీడీపీవో సువర్ణమ్మ



మాట్లాడుతున్న మహిళా పోలీసు రమ్య

జి.మాడుగుల: మండల కేంద్రంలోని గాంధీనగర్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని ఐసీడీఎస్ సీడీపీవో సువర్ణకుమారి శుక్రవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చిన చిన్నారుల బరువులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల వల్ల తల్లి, బిడ్డలు అనారోగ్య బారిన పడతారన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఎక్కడ జరిగినా అడ్డుకోవాలని సూచించారు. సూపర్‌వైజరు పద్మావతి, సిబ్బంది దేవి, ఉష, శిరీష, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: మండలంలోని చినార్కూరు పంచాయతీలో సర్పంచ్ సున్నం అభిరామ్ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిరోధక కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులో వివాహం వల్ల శిశు మరణాలు పెరుగుతున్నాయని, బిడ్డలు అంగవైకల్యం, అనారోగ్య సమస్యలతో పుడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉండాలంటే ఆడపిల్లకు 18 ఏండ్లు తప్పనిసరిగా నిండాలని సూచించారు. దీనిపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని సూచించారు. పంచాయతీ కార్యదర్శి శివమణికంఠ, వీఆర్వో ధర్మరాజు, హెచ్‌ఎం పాయం కన్నారావు, మహిళా పోలీసు రమ్య తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



లంబసింగిలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి: మండంలోని తాజంగి, చింతపల్లి, పెద బరడ ప్రాంతాల్లో ఎంపీడీవో ఆశాజ్యోతి శుక్రవారం ఈవోపీఆర్డీ శ్రీనివాస్‌తో శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డయేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని, అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, నీటి కిట్లను వినియోగించాలని, తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని పంచాయతీ సిబ్బందికి ఆదేశించారు. ఘన సంపద కేంద్రాలను పరిశీలించారు. లంబసింగిలో రాజ్‌మా విత్తనాలను రైతులకు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు కొర్రా రఘునాథ్, పంచాయతీ కార్యదర్శి గోవిందు, కూటమి నాయకులు లక్ష్మయ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో గోతుల పూడ్చివేత

పెదబయలు: మండలంలోని ఇంజరి పంచాయతీ గబుడుపుట్టు నుంచి జి.మాడుగుల మండలం సరిహద్దు చాపగెడ్డ జంక్షన్ గబుడుపుట్టు డిపో వరకు రహదారి గత నెలలో కురిసిన భారీ వర్షానికి అధ్వానంగా మారింది. గోతులతో నిండిపోయి ఉంది. ఈ మార్గంలో సుమారు 3 కిలోమీటర్లు రోడ్డు అధ్వానంగా ఉండడంతో వాహనచోదకులు నానా అవస్థలు పడుతున్నారు. 108 వాహనం రావడానికి కూడా రాలేకపోవడంతో రోగులను డోలీమోతలో తీసుకెళ్లాల్సి వచ్చేదని స్థానికులు చెప్పారు. సుమారు నాలుగు వారాలుగా రహదారి అధ్వానంగా ఉందని, అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని, ఈ మార్గం మీదుగానే వివిధ శాఖల అధికారులు రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వెంకటరరావు, కుమార్, రాజు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సమస్యను పరిష్కరించేందుకు గబుడుపుట్టు గ్రామస్తులు ముందుకొచ్చి, శ్రమదానంతో శుక్రవారం గోతులు పూడ్చే పనులు చేపట్టారు. దీంతో గ్రామస్తులతో పాటు సమీప ఇంజరి, గిన్నెలకోట పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేసి, అభినందించారు.



గబుడుపుట్టు రోడ్డుకు గుంతలు పూడ్చుతున్న గ్రామస్తులు

మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం విఫలం



ఎంపీపీ శెట్టి నీలవేణి

అనంతగిరి(అరకులోయ రూరల్): మృతుల కుటుంబాలకు పరిహారం చెల్లించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఎంపీపీ శెట్టి నీలవేణి చెప్పారు. ఆమె శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల తుపాను కారణంగా మండల పరిధిలోని ఎగువశోభ పంచాయతీ కమలపురం గ్రామానికి చెందిన కోనేపు డొమ్మి(50), భీంపోలు పంచాయతీ బీటుగరువు గ్రామనికి చెందిన భీమరాజు(22)లు వాగులు, గెడ్డలు దాటుతుండగా కొట్టుకు పోయారన్నారు. ఇప్పటివరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం చెల్లించలేదన్నారు. మృతుల ఒక్కో కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షల చొప్పున పరిహారం అందజేసి ఆదుకోవాలన్నారు. పెద్దకోట, ఒనుగుకొండ ప్రాంతాల్లో వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. భీంపోలు పంచాయతీ రామచంద్రపురంలో నేటికీ వంతెన నిర్మాణ పనులు ప్రారంభంకాలేదన్నారు.ఉన్నతాధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

ఆత్మీయ సన్మానం



హెచ్‌ఎం ప్రభుదాస్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



అమీనాబాద్‌కాలనీ టీచర్ లోవరాజును సన్మానిస్తున్న గ్రామస్తులు

కొయ్యూరు: జిల్లా స్థాయి ఉత్తమ ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంగా అవార్డు అందుకున్న డౌనూరు హెచ్‌ఎం ఎస్.ప్రభుదాస్‌ను శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు.ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా పాడేరులో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన కలెక్టర్ దినేష్‌కుమార్, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఇందులో భాగంగా శుక్రవారం పాఠశాలకు వచ్చిన ఆయనకు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.

రాజవొమ్మంగి: మండలంలోని అమీనాబాద్ కాలనీ ఎంపీయూపీ పాఠశాలలో టీచర్ జర్తా లోవరాజును గ్రామస్తులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. లోవరాజు డివిజన్ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా గురుపూజోత్సవం సందర్భంగా గురువారం రంపచోడవరంలో అధికారుల చేతుల మీదుగా అవార్డు అందుకొన్నారు. ఈ నేపథ్యంలో పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయనను సహచర ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు తదితరులు ఘనంగా సత్కరించారు. పాఠశాల చైర్మన్ కలింకోట శ్రీనివాస్, వైస్ చైర్మన్ జమితి షీబా తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నేత బాలదేవ్

దుంబ్రిగుడ: గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ అన్నారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయని అధికారులు స్పందించి ఆశ్రమ పాఠశాలల్లో వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి, ఆరోగ్య పరీక్షలు చేయాలన్నారు. సూర్యనారాయణ, మోహన్‌దాస్, రామకృష్ణ, రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు దారుణం’



కాకినాడలోని జెడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

రంపచోడవరం: రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలో వైద్య సేవలు పరిస్థితి దారుణంగా ఉందని రంపచోడవరం జెడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకలక్ష్మి అన్నారు. కాకినాడలో జరిగిన జిల్లా పరిషత్ సమావేశంలో శుక్రవారం ఏరియా ఆస్పత్రిలో పరిస్థితిపై ఆమె మాట్లాడారు. చిన్న చిన్న వ్యాధులకు సైతం రాజమహేంద్రవరం, కాకినాడ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏరియా ఆస్పత్రిలో కనీసం వైద్య సేవలు అందకపోవడంపై ఇక్కడ పనిచేస్తున్న వైద్యుల నిర్లక్ష్య ధోరణి నిదర్శనమన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగుల ఆరోగ్య సమస్యలను కూడా వైద్యులు తెలుసుకోవడం లేదని ఆరోపించారు. ఒకే గదిలో ఇద్దరు, ముగ్గురు వైద్యులు ఉండి రోగులను పరీక్షిస్తున్న పరిస్థితి ఉందన్నారు. ఉన్నతాధికారులు స్పందించాలని కోరారు.

ఆదివాసీ చట్టాలు పటిష్టంగా అమలుచేయాలి

గంగవరం: ఏజన్సీలో 1/70వంటి గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేసి గిరిజన ప్రాంతాన్ని రక్షించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. రాజంపాలెం గ్రామంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజా ప్రతినిధులు ఆదివాసీల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. అనంతరం పదిమంది సభ్యులతో కూడిన మండలం నూతన కమిటీని ఏకగ్రీవం ఎన్నుకున్నారు.

11న మండల సమావేశం

కొయ్యూరు: మండల సర్వసభ్య సమావేశం ఈనెల 11న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో మేరీరోజ్ ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరగనున్న సమావేశానికి సంబంధిత శాఖాధికారులు గ్రామాల్లో చేస్తున్న వివిధ అభివృద్ధి పనులు, ఇతరత్రా వివరాలతో హాజరుకావాలని సూచించారు. ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి రావాలని ఆహ్వానించినట్టు చెప్పారు.

రహదారులు జలమయం



డౌనూరులో కురుస్తున్న వర్షం

కొయ్యూరు: డౌనూరులో శుక్రవారం భారీ వర్షం కురిసింది. దీంతో సంత వెలవెలబోయింది. మైదాన ప్రాంతాల నుంచి సరకులు తీసుకువచ్చిన వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వారానికి సరిపడా సరకులను తీసుకెళ్లే గిరిజనులు సైతం అవస్థలు పడ్డారు. వర్షం వల్ల రహదారులు జలమయమయ్యాయి. గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్

జి.మాడుగుల: మండలంలో గ్రామైఖ్య సంఘాల ఆధ్వర్యంలో పనిచేస్తున్న వెలుగు వీవోఏలకు 7 నెలలుగా జీతాలు చెల్లించకపోవటంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు వి.మహేష్ తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెలుగు వీవోఏలకు ఆర్థిక ఇబ్బందులు, సమస్యలు పట్టిపీడిస్తున్నాయని, కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. వీవోఏలకు జీతాలు లేక ఇబ్బందులు పడుతుంటే అధికారులు తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఆన్‌లైన్ వర్క్‌లు, తదితర పనులు సకాలంలో చేయాలని లేకుంటే జీతాలు ఆన్‌లైన్‌లో జనరేట్ చేయమని ఒత్తిడికి గురిచేస్తున్నారని చెప్పారు. గ్రామాలకు వెళ్లాలంటే ప్రయాణ ఖర్చులు కూడా లేని పరిస్థితిలో వీవోఏలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు తక్షణమే చర్యలు చేపట్టి వీవోఏల బకాయి జీతాలు చెల్లించాలని ఆయన కోరారు.

జీతాలు చెల్లించాలని వినతి

రంపచోడవరం: అటవీశాఖలో గత కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు కనీసం తమకు జీతాలు కూడా ఇవ్వడం లేదని అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు తెలిపారు. రంపచోడవరం అటవీశాఖ కార్యాలయంలో శుక్రవారం తమ నిరసన తెలిపి అటవీ అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అటవీశాఖ పురోగతి కోసం పనిచేస్తున్న తమను పట్టించుకోవడం లేదన్నారు. బకాయి జీతాలు చెల్లించాలని కోరారు. ఈ నెల 9వ తేదీ నుంచి విధులు కొనసాగించలేమని తెలిపారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు శాంతియుత పోరాట చేస్తున్నట్టు ప్రకటించారు.